తెలుగు డిజిటల్ దినపత్రిక

# సిరి

...People Voice | www.siridaily.com

సోమవారం, అక్టోబర్ 20, 2025 | సంపుటి-1 సంచిక-306 పేజీలు-11

The Largest Readers Local Digital Daily



# వెలుగు దివ్వెల సంబురమే దీపావళి

- జీవితంలో వెలుగులు పంచే పండుగ
- విజయానికి ప్రతీక దీపావళి
- జగతిని జాగృతం చేసే చైతన్య దీపులు

చీకటి వెలుగుల రంగేళీ...జీవితమే ఒక దీపావళి అంటూ అంగరంగ వైభవంగా జరుపుకునే పండగ దీపావళి.. వెలుగు దివ్వెల సంబరమే దీపావళి.. నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు మనసు మంచితనంతో నింపి ప్రతి ఒక్కరు తారాజువ్వలా ఉన్నతంగా ఎదగాలని.. మనలోని చీకటి తరిమికొట్టే దీపం వెలుగులో నీలం, పసుపు, తెలుపు రంగులు కలిసి ఉంటాయి. అవి విజ్ఞానం, వివేకం, వినయాలకు సంకేతం. సమాజంలో చెడు ఎంత చెలరేగినా చివరకు నాశనం కాక తప్పదని చెప్పే పండుగ దీపావళి...దీపావళి పండగ సందర్భంగా సిరి ప్రత్యేక కథనం...

**– (జి.పరంజ్యోతి)
సంగారెడ్డి ప్రతినిధి,
అక్టోబర్ 19 (సిరి న్యూస్):**

వివరాలు 2లో





పాఠకులు, ప్రకటన కర్తలు ఏజెంట్లకు

**దీపావళి శుభాకాంక్షలు**

పండుగ సందర్భంగా సోమవారం
మా కార్యాలయానికి సెలవు..
మంగళవారం సంచిక వెలువడదు..
పునర్దర్శనం బుధవారం

**శివశంకర్‌రావు
మేనేజింగ్ డైరెక్టర్..**



# అగ్నిమాపక కేంద్రాల సేవలు హర్షనీయం

- ఫైర్ డిపార్ట్మెంట్ అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

9



## లెక్క చూపని నగదు స్వాధీనం

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్):** జహీరాబాద్ మండలం మాడ్గి వద్ద ఉన్న అంతర్రాష్ట్ర ప్రాంతీయ రవాణా సంస్థ (ఆర్టీఏ) చెక్ పోస్ట్ పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆదివారం తెల్లవారు జామున దాడి చేసి సిబ్బంది నుంచి లెక్కల్లో చూపని రూ.43,300 నగదును స్వాధీనం చేసుకున్నారు.

3



# సీఎం రేవంత్ రెడ్డికి రైతులపై సోయి లేదు

- పత్తి, మొక్క జొన్న, వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- రైతు కూలీలతో మాజీ మంత్రి హరీష్ రావు మాటామంతి

10



**సిద్దిపేట, అక్టోబర్ 19 ( సిరిన్యూస్):**
సీఎం రేవంత్ రెడ్డికి ప్రతి పక్షాలను తిట్టే బూతుల మీద ఉన్న సోయి పత్తి, మొక్క జొన్న, వరి పంటలు సాగు చేసిన రైతుల తిప్పలపై లేదని, ప్రభుత్వం యుద్ధ ప్రాదిపదికన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలనీ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని గంగాపూర్ గ్రామంలో మొక్క జొన్న కంకుల పొట్టు తీస్తున్న కూలీలు పగటి పూట భోజనం చేస్తుండగా హరీష్‌రావు వాళ్ళ దగ్గరకు వెళ్లి కూర్చొని ముచ్చటించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలు, విక్రయాలకు వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.





# వెలుగు దివ్వెల సంబురమే దీపావళి

- జీవితంలో వెలుగులు పంచే పండుగ
- విజయానికి ప్రతీక దీపావళి
- జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి

**చీకటి వెలుగుల రంగేళీ...జీవితమే ఒక దీపావళి అంటూ అంగరంగ వైభవంగా జరుపుకునే పండగ దీపావళి.. వెలుగు దివ్వెల సంబరమే దీపావళి.. నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు మనసు మంచితనంతో నింపి ప్రతి ఒక్కరు తారాజువ్వలా ఉన్నతంగా ఎదగాలని.. మనలోని చీకటి తరిమికొట్టే దీపం వెలుగులో నీలం, పసుపు, తెలుపు రంగులు కలిసి ఉంటాయి. అవి విజ్ఞానం, వివేకం, వినయాలకు సంకేతం. సమాజంలో చెడు ఎంత చెలరేగినా చివరకు నాశనం కాక తప్పదని చెప్పే పండుగ దీపావళి...దీపావళి పండగ సందర్భంగా సిరి ప్రత్యేక కథనం...**

**- (జి.పరంజ్యోతి) సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్):**

భారతీయతకి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు. వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే లంకలోని రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినపుడు కూడా ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని జరుపుకున్నారని రామాయణం చెపుతోంది. చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారు. దీప మాలికల శోభతో వెలుగొందే గృహాంగణాలు, ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే ఆబాల గోపాలం, నూతన వస్త్రాల రెపరెపలు, పిండివంటల ఘుమఘుమలు, బాణసంచా చప్పుళ్ళు, ఈ దివ్య దీపావళి సోయగాలు. ఈ పండుగ ప్రతియేటా ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపాల పండుగకు ముందు రోజు ఆశ్వయుజ బహుళ చతుర్దశి, దీన్ని నరక చతుర్దశి జరుపుకుంటారు

## దీపావళి ఐదు రోజుల పండుగ

దీపావళి ప్రతి ఏడు అశ్వీయుజ మాసంలో బహుళ అమావాస్య రోజు వస్తుంది. ఈ పండుగను ఐదు రోజులు జరుపుకుంటారు. మొదటి రోజు ధన త్రయోదశి దేవతలు రాక్షసులు పాలస ముద్రాన్ని చిలికినప్పుడు లక్ష్మీదేవి పుట్టింది. ఆమెను సంపాదకు దేవతగా భావిస్తారు. అందుకు గుర్తుగా దీపావళి రెండు రోజుల ముందు రోజున ధన త్రయోదశి చేసుకుంటారు. రోజు కొద్దిగా అయినా బంగారం కొంటే కలిసి వస్తుందని నమ్ముతారు. మూడోరోజు దీపావళి నరకాసురులు చనిపోయిన సందర్భంగా ప్రజలందరూ దీపాలు వెలిగించి టపాకాయలను కాల్చి పండుగ చేసుకుంటారు. ఇక నాలుగో రోజు బలి పొద్యమి అంటే ప్రహల్లాదుని మనవడైన బలి చక్రవర్తి ఇంద్ర పదవి దక్కించుకోవాలని అనుకుంటాడు. ఈ రోజును భార్యాభర్తలిద్దరూ ఒకరినొకరు కానుకలు ఇచ్చుకొని ప్రేమను తెలియజేసుకుంటారు. చివరగా ఐదవరోజు అన్నాచెల్లెళ్ల పండుగ. దీనిని భగిని హస్తభోజనం అని పిలుస్తారు. అన్నలు చెల్లెళ్ల ఇంటికి వెళ్లి కానుకలు ఇచ్చి వాళ్ళ చేతి వంట తినిపిస్తారు.

## దీపావళికి ప్రపంచవ్యాప్త ప్రాదాన్యత...

పండుగలలో దీపావళి ఎంతో ప్రాధాన్యతను సంతరించుకొంది. ఈ పండగను చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకొంటారు. ఈ దీపావళి పండగ అంటే పిల్లలు దగ్గరనుండి పెద్దలవరకు సంబరమే, ఆకాశంలో రంగుల హరివిల్లు, లోకాలకు కాంతులు పంచే పండగ ఈ దీపావళి, ప్రపంచం దృష్టిని ఆకర్షించే పండగ మన దీపావళి, భారత దేశమే కాకుండా ఈ పండగ ఫిజి, గయానా, మలేషియా, మయన్మార్, నేపాల్, శ్రీలంక, సింగపూర్ లాంటి విదేశాల్లోనే కాకుండా ఇటీవల పాకిస్తాన్ సింద్ ప్రావిన్సు లో కూడా అధీకృత సెలవుదినంగా ప్రకటించడం గమనార్హం. సంస్కృతంలో దీపావళికి అర్థం దీపాల వరుస. దీపావళి పండగ అనగా చీకటిపై వెలుతురు సాధించిన విజయం, చెడుపై మంచి సాధించిన విజయం.

## దీపావళిని ఎకో ఫ్రెండ్లీగా జరుపుకోవాలి...

ఈ దీపావళి అందరికి సంతోషాన్ని ఇవ్వాలని ప్రతి ఒక్కరు ఆశిస్తున్నారు. అలానే ఈ దీపావళిని ఎకో-ఫ్రెండ్లీగా జరుపుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే వాతావరణం కాలుష్యం కారణంగా విషం చిమ్ముతున్న విషయం అందరికీ తెలిసిందే. టపాసులు కాల్చటం ద్వారా విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడకుండా తక్కువ కాల్చటం మంచిది. అలానే పిల్లలు టపాసులు కాల్చేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే పెంపుడు జంతువులను శబ్ద కాలుష్యానికి బెంబేలు పడకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది.



# దీపావళి వెలుగులు జిల్లా ప్రజల జీవితాల్లో ఆనందం నింపాలి

• జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్) :**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ వెలుగులు ప్రతి ఇంటిలో ఆనందం నింపాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు దీపావళి పండుగను ఉత్సాహంగా జరుపుకుంటూ, అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. టపాసులు కాల్చేటప్పుడు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. టపాసులు విక్రయించే దుకాణదారులు ప్రభుత్వ అనుమతులు పొందిన నాణ్యమైన పటాకులు మాత్రమే అమ్మాలని, సరసమైన ధరలకు వినియోగదారులకు అందించాలన్నారు. పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలని కలెక్టర్ సూచించారు. టపాసులు కాల్చేటప్పుడు సింథటిక్ వస్త్రాలు ధరించకుండా, కాటన్ దుస్తులు ధరించడం సురక్షితమని కలెక్టర్ తెలిపారు. పటాకులు కాల్చేటప్పుడు పెట్రోలు, డీజిల్ వంటి దహన పదార్థాల దగ్గరికి వెళ్లకూడదని, అలాగే పర్యావరణహిత పటాకులను వినియోగించడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. అగ్ని ప్రమాదాలు లేదా గాయాలు సంభవించిన సందర్భంలో వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని లేదా అగ్నిమాపక శాఖను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నంబర్ 101 కు సమాచారమివ్వాలని సూచించారు. శాంతి, భద్రత, ఆనందాలతో కూడిన దీపావళి పండుగ జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు.

# లెక్క చూపని నగదును ఏసీబీ స్వాధీనం







**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్) :** జహీరాబాద్ మండలం మాడ్గి వద్ద ఉన్న అంతర్రాష్ట్ర ప్రాంతీయ రవాణా సంస్థ (ఆర్టీఏ) చెక్ పోస్ట్ పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆదివారం తెల్లవారుజామున దాడి చేసి సిబ్బంది నుంచి లెక్కల్లో చూపని రూ.43,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక, తెలంగాణ మధ్య తిరిగే వాహనాల నుంచి సిబ్బంది అక్రమంగా లంచం వసూలు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు మెదక్ రేంజ్ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలోని బృందం చెక్ పోస్ట్ పై దాడి చేసి సిబ్బంది నుంచి నగదును స్వాధీనం చేసుకుంది. తెలంగాణకర్ణాటక సరిహద్దు దాటే వాహనాల నుండి లంచంగా ఈ డబ్బును వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. జహీరాబాద్ ఆర్టీఏ చెక్ పోస్ట్ వద్ద లెక్కల్లో లేని నగదును ఏసీబీ స్వాధీనం చేసుకుంది.

# సీఎం రేవంత్ రెడ్డికి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్):** హైదరాబాద్ లో లైసెన్స్ డ్ సర్వేయర్లకు సర్టిఫికెట్ ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పుష్ప గుచ్ఛం ఇచ్చి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్) :** దీపాల తేజస్సుతో అంధకారాన్ని పారద్రోలే దీపావళి పండుగను ప్రజలు సంతోషంగా, సఖ్యతతో జరుపుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు దీపావళి శుభా కాంక్షలు తెలుపుతూ, ప్రతి ఇంటా వెలుగులు నిండిపోవాలని, ప్రతి హృదయం ఆనందంతో మిలమిలలాడాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగ మనకు సత్సంకల్పం, సత్కార్యానికి నిదర్శనమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. మన సమాజం లో ప్రేమ, ఐకమత్యం, పరస్పర సహకారం పెంపొందించేలా ఈ పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు. పిల్లలు పటాకులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఇంటిలో ఆనందం, సుఖశాంతులు, ఐశ్వర్యం నెలకొనాలని, వెలుగు పండుగ అందరికీ కొత్త ఆశలు, విజయాలు తీసుకురావాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆకాంక్షించారు.

# పలు ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసిన స్టేట్ టాస్క్ ఫోర్స్ బృందం



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్) :** సంగారెడ్డి జిల్లాలో గత రెండు రోజులుగా స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం వివిధ ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేయడం జరిగింది. వెల్నెస్ హాస్పిటల్, ఎస్.వి. హాస్పిటల్, సన్ రైస్ హాస్పిటల్, కీర్తి హాస్పిటల్, లలిత ఫెర్టిలిటీ అండ్ లాప్రోస్కోపీ సెంటర్ ను తనిఖీ చేయడం జరిగింది, హాస్పిటల్ కి సంబంధించిన పర్మిషన్స్, చార్జెస్ లిస్ట్, స్టాఫ్ క్వాలిఫికేషన్ వివిధ రికార్డులను పరిశీలించారు. కీర్తి హాస్పిటల్, లలిత ఫెర్టిలిటీ అండ్ లాప్రోస్కోపీ సెంటర్ ను పరిశీలించి స్కానింగ్ సెంటర్ కు సంబంధించిన రికార్డులు డి ఎం అండ్ హెచ్ ఓ ఆఫీస్ కు, ఆన్లైన్లో సబ్మిట్ చేయనందుకు స్కానింగ్ సెంటర్ ను సీజ్ చేయడం జరిగింది. జిల్లా కమిటీ నిర్ణయం మేరకు వారికి ఫైన్ వేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సంగారెడ్డి జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటల్ నిర్వాహకులు నియమ నిబంధనలను తప్పక పాటించి రికార్డులు సక్రమంగా పొందుపరచాలని లేనియెడల తగు చర్యలు తీసుకుంటామని తెలియజేసారు.

# గంజాయి తరలించే వ్యక్తి అరెస్ట్




**పటాన్ చెరు అక్టోబర్ 19, (సిరి న్యూస్):** అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తి నీ అరెస్ట్ చేసినట్లు స్థానిక పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వినాయక రెడ్డి తెలిపారు. ఆటో నెంబర్ ఎపి 39 యూ ఏ 1048 గల దానిలో గంజాయి రవాణా చేస్తూ ముత్తంగి గ్రామ శివారులోని ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్ ప్రక్కన నుండి ఈ రోజు వస్తున్నారనే నమ్మదగిన సమాచారము మేరకు SI మహేశ్వర్ రెడ్డి తన సిబ్బంది తో సర్వీస్ రోడ్ వద్ద మాటువేసి, అట్టి ఆటో రాగానే పట్టుకొని వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణ లో తన పేరు నిశాద్ వీరేంద్ర కుమార్ (37) అల్లూరి సీతారామరాజు జిల్లా, వై రామవరం మండలం, పాలగడ్డ గ్రామానికి చెందిన వ్యక్తి గా గుర్తించి నట్లు చెప్పారు. అతనికి ఒడిస్సాకు చెందిన ఘెను అనే వ్యక్తి గంజా యిని తన గ్రామానికి తెచ్చి ఇచ్చి, తను చెప్పిన ప్రదేశములో రవాణా చేసినందు రూపాయలు 50,000/-ఇస్తానని చెప్పడముతో అధిక డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశముతో తన సీక్రెట్ గా ఏర్పాటు చేసుకున్నా స్థలములో దాచి ఉంచుకొని ఇక్కడకు తీసుక వచ్చినట్లు చెప్పారు. ఈ వ్యక్తి వద్ద 26.4 Kgs ఎండు గంజాయిని రవాణాకు ఉపయోగించిన ఆటోని రెండు సెల్ ఫోన్లను స్వాదీన పర్చుకొని ఎస్ ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సి ఐ వినాయక రెడ్డి తెలిపారు

# నలుగురి జూదరులపై కేసు నమోదు



**జహీరాబాద్ అక్టోబర్ 19 (సిరి న్యూస్)** జహీరాబాద్ న్యాల్ కల్ మండలం, రేజింతల్ గ్రామంలోని అంజిరెడ్డి వ్యవసాయ పొలంలో జూదం ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై సుజిత్ తెలిపారు. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు జూదం ఆడుతుండగా వారి వద్ద నుండి రూ:15690 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. దాడి చేసిన వారిలో స్థానిక పోలీసులు మహేష్ సాయికుమార్ మోహన్ లు ఉన్నారు.





- ఉత్తర భారతీయులు తెలంగాణ వాసులే
- అతి త్వరలో సూర్య దేవాలయం, ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన
- ప్రతి ఒక్కరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ సముచిత ప్రాధాన్యత
- ప్రతి గెలుపులో మీ మద్దతు మరువ లేనిది
- ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్

# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్‌చెరు



**పటాన్ చెరు, అక్టోబర్ 19, (సిరి న్యూస్) :** మినీ ఇండియా గా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని, జీవనోపాధి కోసం దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి తరలి వచ్చి దశాబ్దాలుగా పటాన్ చెరు నియోజక వర్గంలో నివసిస్తున్న ప్రజలందరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటూ వారి ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివా రం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామ శివారులో గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపావళి పర్వ దినం పురస్కరించు కొని ప్రతి ఏటా ఉత్తర భారతీ యులు ఘనంగా నిర్వహించుకునే చట్ పూజ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి ప్రవేశించిన నాటి నుండి నేటి వరకు ఉత్తర భారతీయులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నామని తెలిపారు. మొదటిసారి ఎంపీటీసీగా ఎన్నికైన నాటి నుండి ఎంపీపీ, మూడుసార్లు పటాన్ చెరు ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో వీరి మద్దతు మరువలేనిదని అన్నారు. నియోజకవర్గం లోని వివిధ పరిశ్రమలలో కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్న ఉత్తర భారతీయులకు ఏదైనా ప్రమాదాలు సంభవించినప్పుడు యాజమాన్యాలతో చర్చించి మెరుగైన నష్ట పరిహారాలు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల అగర్వాల్ రబ్బర్ పరిశ్రమతో పాటు సాయిబాబా సెల్లులోజ్ పరిశ్రమలో ప్రమాదాలకు గురైన కార్మికుల కుటుంబాలకు మెరుగైన నష్ట పరిహారం అందించామని గుర్తు చేశారు. ఎప్పుడు ఎటువంటి సమస్య వచ్చినా తనను సంప్రదించాలని.. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గం లోనే స్థిర నివాసం ఏర్పరచుకునేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ సముచిత ప్రాధాన్యత అందిస్తున్నామని తెలిపారు. గతంలో హామీ ఇచ్చిన విధంగా అతి త్వరలో ఉత్తర భారతీయుల కోసం ఫంక్షన్ హాల్, సాకి చెరువు కట్ట పైన సూర్యదేవుడి ఆలయం నిర్మించబోతున్నామని తెలిపారు. చట్ పూజా సందర్భంగా ఉచితంగా చెరుకు పంపిణీకి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం నాయకులు సందీప్ షా కు సమావేశం ఘన నివాళులు అర్పించింది. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, బీడీఎల్ భానూరు సిఐ విజయ్ కృష్ణ, దశరథ రెడ్డి, వెంకటరెడ్డి గూడెం మధుసూదన్ రెడ్డి, పరమేష్ యాదవ్, రాజన్ సింగ్, రామచంద్రారెడ్డి, సంఘం ప్రతినిధులు సంజయ్ సింగ్, నీరజ్, జై కిషన్, టింకు, రవికుమార్, దిలీప్ గుప్తా, బుగోల్, యోగేష్, పాండే, నరేందర్, పింటూ సింగ్, దినోత్, చోబె, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ దేవాలయానికి విరాళం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి





**గుమ్మడిదల రూరల్ , అక్టోబర్ 19 ( సిరి న్యూస్)** నూతనంగా నిర్మిస్తున్న ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి అలయ అభివృద్ధికి విరాళం అందజేసిన సిజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆదివారం గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి దేవాలయానికి సిజిఆర్ ట్రస్టు చైర్మన్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తన వంతుగా 1,01,116 రూపాయలు విరాళం అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతుగా పెద్దమ్మ తల్లి ఆలయానికి మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్ని కులాల వారికి సహాయ సహకారాలు అందిస్తానని గ్రామాల్లో దేవాలయాలు ఆధ్యాత్మికతకు ప్రతీకలు దేవాలయ అభివృద్ధి అంటే గ్రామ అభివృద్ధికే పునాది ప్రతి గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలు ఏర్పడితే ప్రజల్లో ఐకమత్యం సానుకూల దృక్పథం పెరుగుతాయి అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కుమార్ గౌడ్ వెంకటేష్ గౌడ్ బాల్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి భార్గవ్ చారి విశాల్ గౌడ్ పొన్నాల శ్రీనివాస్ రెడ్డి కరుణాకర్ రెడ్డి పద్మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి రాజయ్య యాదగిరి కాంతారావు గోపాల్ ఆంజనేయులు యాదిరెడ్డి మహేష్ సాయి గౌడ్ స్థానిక బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

- మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు



**అందోల్ అక్టోబర్ 19 (సిరిన్యూస్) :** పవిత్రమైన పండగ సందర్భంగా ప్రతి ఇంట్లో జ్ఞానం, సంతోషం, శ్రేయస్సు అనే వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆయన లక్ష్మీదేవిని పార్థించాడు. ఈ పండగ ప్రజలందరికీ నూతన ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని అందించాలని చిట్టిబాబు అన్నారు. పండగ సందర్భంగా ప్రజలు బాణసంచా విషయంలో జాగ్రత్తలు తీసుకొని, సురక్షితంగా దీపావళిని జరుపుకోవాలని మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. పిల్లలు విషయంలో తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, బాంబులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని చిట్టిబాబు అన్నారు. పసిపిల్లలను టపాసులకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు అని మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు తెలియజేశాడు.

# దీపం దైవీ భావనకు ప్రతి రూపం



యావత్ హిందూ సమాజం అనాదిగా జరుపుకొనే పండుగలలో దీపావళి పండుగ మిక్కిలి ప్రశస్తమైనది. వెలుగులను విరజిమ్ముతూ చీకట్లను పారద్రోలుతూ జనావళి హృదయాలలో ఆనందోత్సాహాలతో పాటు ఆరోగ్యాన్ని, అభ్యుదయాన్ని, ఆధ్యాత్మికత్వాన్ని పెంపొందించే విధంగా దీపావళి పర్వదినాన్ని తరతరాలుగా కేవలం హిందువులే కాకుండా నేపాల్, మారిషియస్, శ్రీలంక, గయానా, ఫిజి, ఇండోనేషియా, మలేషియా, బర్మా, టిబెట్, ఆస్ట్రేలియా మొదలైన దేశప్రజలు సైతం ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఉత్తేజంగా జరుపుకునే కన్నుల పండుగ దీపావళి.

ఈ పండుగ ఆశ్వయుజ బహుళ చతుర్దశి నాడు (మరుసటిరోజు అమావాస్య) వస్తుంది. దీపావళి అనగా దీపముల వరుస. ఈ పండుగనాడు పడుతులు ప్రమిదలలో చమురు పోసి, వత్తి వేసి, ఇంటి ముంగిళ్ళలోనూ, అడుగుల పైన, మెడల పైన, ఇంటి ప్రహరీ గోడల పైన వరుసగా బారులు తీర్చి దీపాలు వెలిగిస్తారు. ఈ చతుర్దశిని నరక చతుర్దశి అని, మరునాడు వచ్చే అమావాస్యను దీపావళి అమావాస్య అని కూడా అంటారు.

**నిత్య చైతన్య దీప్తి సత్య దేవి**

సత్యా కృష్ణులు నరకాసురునితో యుద్ధం చేసి ఈరోజే అతన్ని సంహరించారు కనుక ఇది నరక చతుర్దశి అయ్యిందని భాగవతంలోనూ, హరివంశంలోనూ హృద్యమైన పద్యాలలో వర్ణించబడింది. లోక కంటకుడైన కారణంగా తమ బిడ్డ అయినప్పటికీ ఆ నరకాసురుని హతమార్చారు సత్య కృష్ణులు. నరకాసురుడు అంటే నరకము అనగా కష్టము, బాధ అని కూడా అర్థము. లోకానికి కష్టాలను, బాధను కలిగించినవాడు నరకాసురుడు. లోక సంక్షేమం కోసం





తాను పుత్ర శోకాన్ని సైతం అనుభవించింది ఆ కన్నతల్లి. గర్భశోకాన్ని తన వరకే పరిమితం చేసుకొని దుర్మార్గుడైన తన పుత్రుని వలన కలిగిన అత్యాచార, అన్యాయ, అమానవీయ చీకట్లను తొలగించిన అమృతమూర్తి. నిత్య చైతన్య దీప్తి. మహిళా లోకానికి ఆదర్శ స్త్రీమూర్తి ఆ సత్య దేవి.

ఋతుచర్య, వాయుశోధనలతో ఆరోగ్యప్రసాదిని

వైదిక సాహిత్యంలో దీపం పరబ్రహ్మస్వరూపంగా నుతించబడింది. అగ్ని ప్రథమః అని ఋగ్వేదం పేర్కొంది. అందుచేతనే ప్రతి పూజలోనూ ముందుగా దీపాన్ని వెలిగిస్తారు. ఋగ్వేదంలోని ప్రథమ సూక్తంలో ఇలా చెప్పబడింది.

**దీపం జ్యోతి పరబ్రహ్మ;**
**దీపం సర్వతమోహతే।**
**దీపేన సాధ్యతే సర్వం;**
**దీపలక్ష్మీ నమోస్తుతే॥**

(దీపం జ్యోతి స్వరూపంలోని పరబ్రహ్మము. సమస్త అంధకారాలను దూరం చేసి వెలుగులు ప్రసాదిస్తుంది. ఎంతటి కష్టతరములైన కార్యాలనైనా సాధింపబడుతుంది. ఇంతటి మహత్తరమైన శక్తి కలిగి ఉన్న దీపలక్ష్మీ దేవికి నేను నమస్కరిస్తున్నాను.) అంటూ, ప్రతి నిత్యం ప్రాతః సాయం సంధ్యల యందు నమస్కరిస్తారు హైందవులు. ఇలా అనుదినం ఉదయ సాయం సంధ్యల యందు దీపారాధన చేయడం వల్ల క్రమంగా వ్యక్తిలో దైవీభావన పెంపొందుతుంది. దాని వలన వినయం, వివేకం ఏర్పడతాయి. ఇలా వినయవంతుడు తన చుట్టూ ఉన్న సమాజానికి ఎలాంటి చెడు చేయకుండా జీవిస్తాడు. అది తెలియని వాడు నరకాసురుడిలా ఈ ప్రపంచమంతా తన కోసమే ఉందని భ్రమపడి తన స్వార్థ ప్రయోజనాల కోసమే అన్నింటినీ అందరినీ ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. అందుకు పరులను బాధిస్తాడు. ఇది దానవ లక్షణం. నరక చతుర్దశి లోని 'నరక' అన్న పేరుకు నరకాసురుడు కాక నరకం అంటే 'స్వర్గం కానిది' అని అర్థాన్ని గ్రహించాల్సి ఉంటుంది.

**నరకాయ ప్రదాతవ్యో;**
**దీపస్సంపూజ్య దేవతా।**
**చతుర్దశ్యాంతు యే దీపో;**
**నరకాయ ప్రదీయతే॥**
**తేషాం పితృ గణాం సర్వే।**
**నరకాత్స్వర్గ మవాప్నుయు॥**

(నరకం కలుగకుండా దీపం వెలిగించాలి. చతుర్దశి నాడు ఎవరైతే ఈ దీపం వెలిగిస్తారో వారికి, వారి పితృదేవతలకు నరకం తొలగి, స్వర్గం ప్రాప్తిస్తుంద) ని పై శాస్త్ర వచనం తెలియజేస్తుంది.

ఇక దీపావళి నాడు తైలాభ్యంగన స్నానానికి విశేషమైన మహత్తు ఉన్నది. ఈ రోజున నువ్వుల నూనెలో లక్ష్మీదేవి ఉంటుందని హిందువుల ప్రగాఢ నమ్మకం. నదులు, బావులు, చెరువుల లోని నీటిలో గంగామాత కొలువుదీరి ఉంటుందని హిందువులంతా నమ్ముతారు. ఈ విషయాన్నే ఈ శ్లోకం వివరిస్తుంది.

**తైలే లక్ష్మీర్జలే గంగా;**
**దీపావళి తిథౌ వసేత్।**
**అలక్ష్మీ పరిహారార్థం;**
**తైలాభ్యంగో విధీయతే॥**

ఈరోజు తలంటుకొని స్నానం చేయడం వల్ల అంతవరకు ఉన్న దారిద్ర్యం అంతా తొలగిపోతుంది. గంగా స్నానఫలం కూడా దక్కుతుంది. ఇక నరకప్రాప్తి భయం తొలగుతుంది. అయితే సూర్యోదయానికి ముందు నాలుగు ఘడియల కాలం అరుణోదయ సమయం. ఆలోగా తలస్నానం చేయడం ఎంతో శ్రేష్ఠం. ఒకవేళ అలా వీలుకాకపోతే సూర్యోదయానంతరమైన తప్పనిసరిగా తలంటు స్నానం చేయాలని శాస్త్రం చెబుతుంది.

ఈ పండగ వెనుక మరొక విశేష ఆరోగ్య ప్రయోజనం కూడా దాగుంది. ఇది శరదృతువులో వస్తుంది. కనుక ఈ ఋతువు ప్రభావంతో ప్రకృతిలో ఏర్పడిన కల్మషాలను సరిదిద్ది సకల ప్రాణుల ఆరోగ్యాలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా చేసుకోవడానికి మన పూర్వీకులు మనకు ఒక అద్భుతమైన, ఆరోగ్యకరమైన, ఆనందదాయకమైన మార్గాన్ని నిర్దేశించారు. దీనికే ఋతు చర్య అని పేరు. అందులో భాగమే ఈ వాయు శోధనము. అనగా వాయు కాలుష్య నివారణము.

శరదృతువులో వర్ష ఋతువు ప్రభావం వల్ల రోగ కారక క్రిములు ఎన్నో వాతావరణంలో పుడతాయి. రోగాలను వ్యాపింపజేసే క్రిములను నాశనం చేయాల్సి ఉంటుంది. ఈ రోగకారక క్రిములలో కొన్ని కాంతికి, కొన్ని వాసనకు, మరికొన్ని శబ్దానికి అంతరించడమో లేదా పారిపోవడమో జరుగుతుంది. కాబట్టి దీపావళి రోజున మతాబుల వంటి కాంతిని ఇచ్చేవి వాటిలో వాడిన గంధకం వంటి రసాయనాల వలన వచ్చే వాసన, టపాసుల వల్ల వచ్చే శబ్దం వీటన్నింటి వల్ల వాతావరణంలో వాయుశోధన జరిగి వాతావరణం కాలుష్య రహితంగా మారుతుంది.

**నవ్వుల పువ్వుల తారాజువ్వల దీపావళి**

ఈ దీపావళి పర్వదినం నవ్వుల పువ్వులు తారాజువ్వల వలే విరజిమ్మే సంతోషాల సంబరం అనవచ్చు. ఈ పర్వదినం సమాజంలోని అజ్ఞాన, అత్యాచార, దురాచార, అన్యాయ, అక్రమాలను పారద్రోలి "తమసోమా జ్యోతిర్గమయ" అనే వేదోక్తికి సప్రమాణికంగా జ్ఞాన, సత్య, అభ్యుదయ, ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ సంస్కారమనే దివ్య తేజోపథాన నడుపుతుంది దీపావళి పర్వదినం. ప్రతి వ్యక్తి జ్ఞాన దీపకళికగా మారి, మానవీయ విలువలను పరిరక్షిస్తూ, సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందజేయాలి. యావత్తు జగత్తును దివ్య జ్యోతిర్పథాన పయనింపజేయాలని దీపావళి సందేశంగా మనమంతా గ్రహిద్దాం! ఆ ఆలోచనతో దీపావళిని జరుపుకుందాం! 'లోకాస్సమస్తా సుఖినోభవన్తు'





**వ్యాస కర్త:**
**"సాహిత్య కళా విభూషణ్"**
**చౌడూరి నరసింహారావు**
**ప్రవచన కర్త, ఆధ్యాత్మిక విశ్లేషకులు**
**భాగ్యనగరం 9705100788**




# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



- 35 ఏళ్ల వయస్సులో పరుగుపందెం 6.25 సెకండ్లలో 60 మీటర్లు
- యోగా చాంపియన్షిప్ లలో బంగారు, వెండి, కాంస్య పతకాలు
- యోగాలోనూ ప్రావీణ్యం ఉచిత శిక్షణ ఇస్తున్న యోగా గురు
- యోగా, మెమొరీ, సెల్ఫ్ డిఫెన్స్, అథ్లెటిక్ ట్రైనింగ్
- బాచంపల్లి అజయ్ కుమార్, యోగా గురు

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్):** 35 ఏళ్ల వయస్సులో ప్రపంచ రికార్డును నెలకొల్పారు. అది కూడా తాను మొదటి నుంచీ సాధన చేస్తున్న యోగాలో కాదు.. పరుగు పందెంలో యోగా మాస్టర్గానే కాకుండా, ఆయన యోగా గురు, యోగా పాఠాలు చెప్పడం వరకే పరి మితం కాలేదు. పరుగుపందెంలో తనకంటూ ప్రత్యేకత చాటుతున్నారు. బాచంపల్లి అజయ్ కుమార్ మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన సురేందర్, రుక్మిణి దంపతుల కుమారుడు అజయ్ కుమార్ తండ్రి సురేందర్ ఓడీఎఫ్ ఉద్యోగి యోగా గురువు కావడంతో పరిశ్రమలో యోగా శిక్షణనందించేవారు. బాల్యం నుంచి తండ్రినే గురువుగా భావించి యోగాభ్యాసంలో ప్రావీణ్యం పొదారు ఆజయ్ కుమార్, తండ్రి వద్ద శిక్షణ ప్రారంభించిన ఆజయకుమార్ 2006లో రామ్ దేవ్ బాబా హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పిల్లల క్యాంపునకు హాజరయ్యారు. 2009లో హరిద్వార్లో యోగా టీచర్గా శిక్షణ పొంది 8 సంవత్స రాల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో యోగాలో సేవలం దించారు. 2017లో సంగారెడ్డికి వచ్చి యోగా శిక్షకుడిగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణనందిస్తున్నాడు. ప్రస్తుతం సంగారెడ్డి కలెక్టరేట్ వెనుక భాగంలో ఉన్న పార్కులో యోగ శిక్షణ ఇస్తున్నారు.

### పరుగుపందెంలో ప్రపంచ రికార్డు

2025 ఏప్రిల్ 3 నుంచి 7 వరకు నేపాల్ దేశంలో ఎస్బీకేఎస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పరుగు పందెంలో టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రీడాపోటీల్లో ఇండియా, బుటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సంగారెడ్డికి చెందిన అజయ్ కుమార్ ఉత్తమ ప్రతిభ కనబర్చి 60 మీటర్లు, 100, 200 మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకాలు సాదించారు. 35 ఏళ్ల విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో 625 సెక న్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డు సాదించారు. అలాగే, రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయిలో 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 100, 200 మీటర్ల పరుగు పందెంలో 2 వెండి పతకాలు, రాష్ట్ర స్థాయిలో 200 మీటర్ల పరుగు పందెంలో 4 బంగారు, ఒకటి వెండి పతకాలు, జాతీయ స్థాయిలో 100, 200 మీటర్ల పరుగు పందెంలో ఒకటి బంగారు, 2 వెండి పత కాలు, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన 100, 200 మీటర్ల పరుగు పందెంలో 8 బంగారు పతకాలు, వీటితో పాటు యోగా చాంపియన్షిప్ లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన చాంపియన్ షిప్ లో బంగారు, వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకు న్నారు.

### పట్టుదలతో అంతర్జాతీయ పోటీలలో విజయ సాదించా
### బాచంపల్లి అజయ్ కుమార్, యోగా గురు

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని బాచంపల్లి అజయ్ కుమార్, యోగా గురు అన్నారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఆఫీస్ వెనకాల ఉన్న పార్కులో యోగా కార్యక్రమంలో ఆదివారం ప్రత్యేక యోగపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనతరం వారు మాట్లాడుతూ నా విజయం కేవలం నాదేం కాదు, నా తల్లిదండ్రుల ఆశీర్వాదం, నా గ్రామం పిల్లుట్ల గౌరవం, నా దేశం భారత్ గర్వం అని చెప్పారు. యోగా, అథ్లెటిక్స్ ద్వారానే శారీరక-మానసిక ఆరోగ్యాన్ని సాధించవచ్చని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. సమాజానికి తిరిగి ఏదైనా ఇవ్వాలనే లక్ష్యంతో ఆయన వరల్డ్ రియలైజర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా ట్రైనింగ్, మెమొరీ ట్రైనింగ్, సెల్ఫ్ డిఫెన్స్, అథ్లెటిక్స్ శిక్షణలను సంగారెడ్డి కలెక్టరేట్ వెనుక పార్కులో ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభించారు. అన్ని వయసుల పెద్దలు, పిల్లలు ఈ శిక్షణలో పాల్గొని తమ ప్రతిభను వెలికి తీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక సాధారణ గ్రామ యువకుడు పట్టుదలతో, శ్రమతో, ధైర్యంతో ప్రపంచస్థాయిలో రికార్డు సృష్టించడం, నేటి తరానికి నిజమైన ప్రేరణగా నిలుస్తోంది.













# స్థానిక సంస్థల ఎన్నికల్లో దుమ్మురేపాలి

- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు వినిపించాలి
- టిఆర్ఎస్ నాయకులకు హరీష్ రావు హితబోధ

**మనోహరాబాద్, అక్టోబర్ 19. సిరి న్యూస్ :** బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి దుమ్మురేపాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు టిఆర్ఎస్ నాయకులకు హితబోధ చేశారు. ఆదివారం హరీష్ రావు గజ్వేల్ కు వచ్చిన సందర్భంగా మనోహరాబాద్ మండలం నాయకులు పురం రవికుమార్ ముదిరాజ్, తాజా మాజీ సర్పంచ్ పూల అర్జున్, జిల్లా ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రేణు కుమార్, నాయకుడు హిమం పురం శేఖర్ గౌడ్ లు గజ్వేల్ నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తో కలిసి హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులతో హరీష్ రావు మాట్లాడుతూ ఇప్పటికిప్పుడే ఎన్నికలు పెడితే కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమి ఖాయమని తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు రిజర్వేషన్ల పేరుతో కాలయాపన చేస్తుందని, అమలు కాని హామీలు పేరుతో ఇటు రైతులను, అటు ప్రజలను మోసం చేసిన దున ఈ ఎన్నికల్లో ఓటమి ఖాయమని గుర్తించి నాటకాలు ఆడుతున్నారని గుర్తు చేశారు. ఒకవేళ ఎన్నికలు వస్తే ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డును పంపిణీ చేసి వారి మోసాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాక పోవడంతో కొంతమంది నాయకులు మాత్రమే స్వార్థం, దందాలు, వ్యాపారాల కోసం పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారని, కానీ కార్యకర్తలు మాత్రం టిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాడి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని నాయ కులకు హరీష్ రావు సూచించారు.



# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మాగంటి సునీతకు మద్దతుగా షేక్ పేట్ డివిజన్ లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడప గడపకు గత బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.; కాంగ్రెస్ బాకీ కార్డులు అందజేశారు. కాంగ్రెస్ కు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెపాలన్నారు.

# మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ లో కలపాలి



- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని హన్మంత రావ్ కు పీఆర్టీయూ వినతి

**మెదక్ ప్రతినిధి:సిరి న్యూస్ :** మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ లో కలపాలని కోరుతూ ఆదివారం మెదక్ జిల్లా పిఆర్టియు నేతలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంత రావ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మేడి సతీష్ రావ్, సామ్య నాయక్ గౌరవ అధ్యక్షులు సబ్బని శ్రీనివాస్ లు మాట్లాడుతూ మెదక్ జిల్లాను చార్మినార్ జోన్ లో కలిపే విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు.రాజన్న సిరిసిల్ల జోన్ లో మెదక్ జిల్లా ఉండటం వల్ల ఈ ప్రాంత ఉద్యోగులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు వాపోయారు. మెదక్ జిల్లా హైదరాబాద్ కు అనుకోని ఉన్న జిల్లా అని, చార్మినార్ జోన్ లో కలిపితే ఈ ప్రాంత ఉద్యోగులకు, నిరుద్యోగులకు అన్ని రకాలుగా మేలు జరుగుతుందన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో పిఆర్టియూ భవనానికి నిధులు కేటాయించాలని వారు కోరారు.ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, ఇతర టీచర్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని హన్మంతా రావ్ ను కోరినట్లు వారు తెలిపారు. తాము ప్రతిపాదించిన వాటిపై హన్మంత రావ్ సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమం లో మెదక్ జిల్లా పిఆర్టియూ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ యువ నాయకుల జన్మదిన వేడుకలు



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్) :** సంగారెడ్డి బిఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి పేరమళ నర్సింలు బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు హరివర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత తనయుడు చింత సాయినాథ్ సమక్షంలో ఈ వేడుకలు జరిగాయి. వారికి కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, విఠల్, శ్రవణ్ రెడ్డి, గొల్ల ఆంజనేయులు, చింటూ, అఖిల్, వెంకటేష్ గౌడ్, పరుశురాం, మాలిక్, రాందాస్ తదితరులు ఉన్నారు.

# చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి

- బీఆర్ఎస్ మెదక్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

**మెదక్ అక్టోబర్ 19(సిరిన్యూస్) :** మెదక్ జిల్లా ప్రజలకు మెదక్ మాజీ ఎమ్మెల్సీ సేరి సుభాష్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారదోలే వెలుగుల పండుగ దీపావళి, ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.ఈ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని,పిల్లలు పటాకులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. లక్ష్మీదేవి అనుగ్రహంతో అందరికీ శుభం చేకూరాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు.



# ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కుటుంబాన్ని పరామర్శించిన ఆదర్శ్ రెడ్డి



**అమీన్ పూర్, అక్టోబర్ 19, (సిరిన్యూస్) :** ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజయ్య చిన్నకోడూరు మండలం గంగారం గ్రామంలో ఇటీవల స్వర్గస్తులయ్యారు, వారి దశదిన కర్మ కార్యక్రమానికి మాజీ స్పీకర్ మధుసూదన చారి తో కలిసి పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఆదర్శ్ రెడ్డి, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఎర్రోళ్ల శ్రీనివాస్ గారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా విజ్జయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రగాఢ నివాళులు అర్పించారు, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెబుతూ, ఎర్రోళ్ల కుటుంబం సామాజిక సేవలో విశిష్టమైన స్థానం సంపాదించిందని, వారి సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, గుమ్మడిదల బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ కృష్ణకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 19 (సిరి న్యూస్) :** జిల్లాలోని అన్ని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు గల ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల, ఇస్నాపూర్ ప్రధానోపాధ్యాయురాలు, డిసిఒ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు ఎం.జయలక్ష్మి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు ఇస్నాపూర్, చిట్కూల్, రంజోల్, రాయికోడ్, అందోల్ గురుకుల పాఠశాలలు బాలురకు హత్నూర, నల్లవాగు, నారాయణఖేడ్, సింగూరు, కొండాపూర్, న్యాల్కల్ పాఠశాలల్లో అవకాశం ఉన్నందున ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్నవారు, ప్రవేశ పరీక్ష రాసినవారు. పరీక్ష రాయని వారు ఆసక్తిగల వారందరు తమ దరఖాస్తులను ఇస్నాపూర్ బాలికల పాఠశాలలో ఈ నెల 22వ తారీఖు (బుధవారం) మధ్యాహ్నంలోపు సమర్పించ వలసిందిగా కోరుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశం కల్పించబడుతుందని తెలిపారు.



## దీపావళి అయిదు రోజుల పండుగ

# విశిష్టత ప్రశస్తి

**మెదక్ రూరల్ అక్టోబర్ 19 (సిరి న్యూస్):** భారతీయ సంస్కృతిలో పండుగలు కేవలం ఆనందం, ఉత్సాహానికి ప్రతీకలు కాదు, అవి మన ఆచార వ్యవహారాల, విలువల ప్రతిబింబాలు. వాటిలో ప్రధానమైనది వెలుగుల పండుగ దీపావళి. అంధకారాన్ని తొలగించి, జ్ఞానం, ధర్మం అనే వెలుగులు వెలిగించే ఆధ్యాత్మిక పండుగ ఇది. దీపావళి ఒక్కరోజు మాత్రమే కాదు; అది ఐదు రోజుల ఆధ్యాత్మిక ప్రయాణం ధన త్రయోదశి నుండి భగినీ హస్త భోజనం వరకు ప్రతి రోజు వేర్వేరు పౌరాణిక సందర్భాలను స్మరింపజేస్తుంది, మనిషి జీవన విలువలను గుర్తు చేస్తుంది.

1. ధన త్రయోదశి ధన్వంతరి జయంతి, ఆయురారోగ్య దినం, దీపావళి వేడుకల ఆరంభ దినం ఇది. ధన త్రయోదశి రోజున సముద్ర మథనంలో అమృతకలశముతో ఉద్భవించిన ధన్వంతరి దేవుని జయంతి గా భావిస్తారు. ఆయురారోగ్యానికి, ఆయుష్షుకు ఆయనే అధిపతి. ఈ రోజు సాయంత్రం ధన్వంతరి పూజతో పాటు, లక్ష్మీదేవి ఆరాధన చేయడం శుభప్రదమని శాస్త్రాలు చెబుతున్నాయి. కొత్త పాత్రలు, బంగారం, వెండి వస్తువులు, కొత్త దుస్తులు కొనడం “ఆర్థికాభివృద్ధి”కి సూచికగా భావిస్తారు. కొన్ని ప్రాంతాల్లో దీనిని ధనలక్ష్మీ పూజ గా కూడా జరుపుతారు. వ్యాపారులు తమ దుకాణాల్లో కొత్త ఖాతాలు మొదలుపెట్టి, లక్ష్మీదేవిని ఆహ్వానిస్తారు.

**2. నరక చతుర్దశి నరకాసుర వధ, చీకట్ల నివారణ దినం .**

దీపావళి పండుగలో రెండో రోజు నరక చతుర్దశి, శ్రీకృష్ణుడు, సత్యభామా కలిసి నరకాసురుని సంహరించిన రోజు ఇది. నరకాసురుడు ప్రజలను భయపెట్టడంతో దేవతలు ఆయన వధకోసం ప్రార్థించగా, కృష్ణుడు ఆయనను సంహరించాడు. ఆ పాపవిమోచనానికి సంకేతంగా ప్రజలు ఉదయం బ్రహ్మ ముహూర్తంలో నూనె స్నానం చేయడం, తలపై సుగంధ ద్రవ్యాలు, చందనం రాసుకోవడం సంప్రదాయం. ఇది శరీర శుద్ధి మాత్రమే కాదు, ఆత్మ శుద్ధికి కూడా ప్రతీక. ఈ రోజు “చిట్టి దీపావళి”గా పిలుస్తారు. ఇంటి ముందర చిన్న దీపాలు వెలిగించి, రాత్రి వేళ తక్కువ పటాకులు కాలుస్తారు.

**3. దీపావళి (అమావాస్య) వెలుగుల పండుగ, లక్ష్మీ పూజా మహోత్సవ.**

దీపావళి మూడవ రోజు పండుగలో ప్రాధాన్యత గలది. ఈ రోజుకార్తీక అమావాస్య పురాణాల ప్రకారం, శ్రీరాముడు రాక్షసరాజు రావణుడిని సంహరించి అయోధ్యకు తిరిగి వచ్చిన రోజు ఇది. ప్రజలు ఆయన రాక సందర్భంగా ఇంటి ముందర దీపాలు వెలిగించి స్వాగతం పలికారు. ఈరోజే మహాలక్ష్మి పూజా దినం, సాయంత్రం సమయాన, ఇళ్లలో దీపాల కాంతిలో లక్ష్మీదేవిని ఆహ్వానించి పూజిస్తారు. సంపద, సౌభాగ్యం, శాంతి కలగాలని ప్రార్థిస్తారు.

వ్యాపారులు, వ్యాపార సంస్థలు ఖాతాల ప్రారంభం, “లక్ష్మీపూజ” నిర్వహించడం సంప్రదాయం. ఈ రోజు రాత్రి గాలి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అన్ని మూలకాలను పవిత్రం చేసే క్షణంగా భావిస్తారు. వెలుగుల కాంతిలో ఆడపిల్లలు, పిల్లలు ఆనందంగా పటాకులు కాల్చుతూ సంబరాలు జరుపుతారు. అంధకారంపై వెలుగుకు విజయోత్సవం ఇదే.



**4. భలి పాడ్యమి వామన అవతార స్మరణ, గోవర్ధన పూజా ప్రాధాన్యం.**



దీపావళి నాలుగవ రోజు భలి పాడ్యమి. విష్ణువు వామన అవతారంలో మహాబలి చక్రవర్తిని పాతాళలోకంలో నివసింపజేసి, సంవత్సరానికి ఒక రోజు భూమిపైకి రావడానికి వరం ఇచ్చాడని పురాణం చెబుతుంది. అందుకే ఈ రోజు భలి చక్రవర్తి భూమిని దర్శించడానికి వచ్చే రోజుగా భావిస్తారు. ప్రజలు దీపాలతో, పూజలతో భలిని స్వాగతిస్తారు. ఈ రోజే గోవర్ధన పూజ కూడా జరుగుతుంది. శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తి ఇంద్రుని కోపం నుండి గోపాలను రక్షించిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటారు. అందుకే గోవు పూజ, గోమాత పూజ ఈ రోజు అత్యంత పుణ్యకార్యంగా భావించబడుతుంది. భర్త భార్యలు కలిసి దీపాలు వెలిగించి, పరస్పర ప్రేమ, సౌభాగ్యానికి సంకేతంగా పూజలు చేస్తారు.

**5. భగినీ హస్త భోజనం**
**సోదర సోదరీమణుల బంధానికి ప్రతీక.**



దీపావళి ఐదవ రోజు భగినీ హస్త భోజనం లేదా యమ ద్వితీయ. ఈ రోజు సోదరుడు తన సోదరిని కలుసుకుని, ఆమె చేతుల మీదుగా భోజనం చేయడం సంప్రదాయం. పురాణాల ప్రకారం, యమధర్మరాజు తన చెల్లెలు యమునా దేవిని దర్శించడానికి వచ్చిన రోజు ఇది. యముడు చెల్లెలితో భోజనం చేసినందుకు ఆమె అతనికి దీర్ఘాయుష్షు వరం కోరిందట. అందుకే ఈ రోజు భోజనం చేసే సోదరుడు దీర్ఘాయుష్షుతో, సుఖశాంతులతో జీవిస్తాడనే విశ్వాసం ఉంది. ఇది ప్రేమ, బంధం, కుటుంబ విలువలకు ప్రతీకగా నిలుస్తుంది. వెలుగుల వెనుక ఉన్న సారాంశం.

దీపావళి కేవలం పటాకులు కాల్చే పండుగ కాదు అది మన మనసులోని చీకట్లను వెలుగులతో నింపే పండుగ.అజ్ఞానం, ద్వేషం, అసూయ, అహంకారం అనే చీకట్లను తొలగించి, ప్రేమ, జ్ఞానం, ధర్మం అనే వెలుగులు వెలిగించమనే ఆధ్యాత్మిక సందేశమే దీపావళి. ప్రతి సంవత్సరం ఈ ఐదు రోజుల పండుగ మన జీవితంలో కొత్త ఆశలను నింపుతూ, వెలుగుల మార్గం చూపుతుంది.

# జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్ ఏర్పాటుకు సూచనలు



**నోహరాబాద్, అక్టోబర్ 19. సిరి న్యూస్ :** జనవరి నెలలో మనోహరాబాద్ లో నిర్వహించే జాతీయస్థాయి కరాటే టోర్నమెంటు ఏర్పాటు కోసం హీరో సుమన్ ను గ్రాండ్ మాస్టర్లు కలిసి వివరించారు. టోర్నమెంట్ ఏర్పాటు కోసం గ్రాండ్ మాస్టర్ లకు పలు సలహాలు, సూచనలు చేశారని సన్ షైన్ చోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే క్లబ్ తెలంగాణ ఫౌండర్, అధ్యక్షులు కరాటే మల్లేష్ ముదిరాజ్ తెలిపారు. ఆదివారం హైదరాబాదులో సుమన్ ను కలిసి జాతీయస్థాయిలో గవర్నమెంట్ ఏర్పాటు కోసం వివరించామన్నారు. ఇందుకుగాను టోర్నమెంట్ ఎలా చేయాలో, పోటీలలో ఎవరెవరు పాల్గొనాలో పలు విషయాలను తమకు వివరించారని మల్లేష్ తెలిపారు. సుమన్ ను కలిసిన వారిలో గ్రాండ్ మాస్టర్లు మహేష్, శ్రీకాంత్, అభిలాష్, తరుణ్, బాబి, తనుజ, అంజలి, స్పందన, నందిని తదితరులు కలిశారు.

# అభివృద్ధి వైపు పరుగులు తీసున్న మెదక్

- మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంత రావ్





**మెదక్ ప్రతినిధి:సిరి న్యూస్ :** మెదక్ అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంత రావ్ అన్నారు. ఆదివారం మెదక్ మండలం మంబోజి పల్లి లో నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ స్టీల్ ఇండస్ట్రీస్ ను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత రావ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలన లో మెదక్ అన్ని రంగాల్లో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా మెదక్ నియోజకవర్గం అభివృద్ధి లో వేగంగా దూసుకుపోతుందన్నారు.మెదక్ మరింత అభివృద్ధి కావాల్సిన అవసరం ఉందన్నారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావ్ మెదక్ అభివృద్ధి పై ప్రత్యేకంగా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గానికి అనేక నిధులు తెచ్చారాని, ఇంకా నిధులు తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని అయన తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ కాంగ్రెస్ సీనియర్ నేతలు ఉప్పల రాజేష్, వెంకట రమణ, బొజ్జ పవన్, శ్రీనివాస్ చౌదరి మాజీ కౌన్సిలర్లు లక్ష్మినారాయణ గౌడ్, లింగం, వసంత్ కుమార్, హనుమాన్ స్టిల్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు అఖిల్ రెడ్డి, అరవింద్ గౌడ్, సృజన్, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

# అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



**వెల్దుర్తి అక్టోబర్ 19 ,(సిరి న్యూస్) :** అప్పుల బాధతో యువరైతు ఆత్మ హత్య చేసుకున్న సంఘటన వెల్దుర్తి మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది . గ్రామానికి చెందిన మేడ్చల్ రాజు వయస్సు 32, సంవత్సరాలు , తనకు గ్రామ సమీపంలో వ్యవసాయ భూమి ఉంది తను వ్యవసాయం చేసుకుంటూ ఒక ట్రాలీ ఆటోను తెచ్చుకొని సొంతంగా ఆటోను నడిపిస్తూ జీవనం సాగిస్తున్నారు . ఇటీవల కాలంలో ట్రాలీ ఆటో నడవక రాజుకు అప్పుల భారం పెరిగిపోవడంతో ఎటు తోచక రాజు శనివారం సాయంత్రం ఇంట్లో చెప్పకుండా పొలం వద్దకు వెళ్లి నేను అప్పుల భారం భరించలేనంటూ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటున్నానని ఇంట్లో వాళ్లకు ఫోన్ చేశాడు. వెంటనే ఇంట్లో వాళ్ళు గ్రామస్తులతో కలిసి పొలం వద్దకు వెళ్లగా రాజు కొన ఊపిరితో ఉన్నాడు అని గమనించిన కుటుంబ సభ్యులు గ్రామస్తులు, 108కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం హైదరాబాద్ హాస్పటల్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలోని చనిపోయాడని రాజు కుటింబికులు తెలిపారు. రాజుకు భార్య సంగీత, తల్లి భారతమ్మ, ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు, ఉన్నారు. చేతికొచ్చిన కొడుకు చనిపోవడంతో వాళ్ళ రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి.మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

## మెదక్ ఫుట్ బాల్ ప్రీమియర్ లీగ్-3 విజేత రామ్స్

- హోరాహోరీగా పోటీ 2-1గోల్స్ తో విజయం




**మెదక్ అక్టోబర్ 19 (సిరిన్యూస్):** మెదక్ ఫుట్ బాల్ లీగ్ పోటీలో రామ్స్ టీమ్ విజేతగా నిలిచింది.మెదక్ జిల్లా కేంద్రంలో మెదక్ ప్రీమియర్ లీగ్-3 పోటీలు నిర్వహించారు. ఐదు టీమ్ లు పాల్గొన్న ఈ ప్రీమియర్ లీగ్ లో తుది పోరుకు రామ్స్, రియాద్ జట్లు చేరాయి.ఆదివారం మెదక్ సాయ్ స్టేడియం లో జరిగింది. ఇరు జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. మొదటి అర్ధ భాగం లో ఎలాంటి గోల్స్ ఏ జట్టు చేయలేదు. రెండవ భాగం ప్రారంభం కాగానే రియాద్ జట్టు గోల్ సాధించి పై చేయి సాధించింది. కానీ మరి కొద్ది నిమిషాల్లోనే రామ్స్ జట్టు గోల్ చేసి సమం చేశారు. ఆటకు మరో ఐదు నిమిషాల సమయంలో రామ్స్ జట్టు గోల్ కొట్టి విజేతగా నిలిచింది. విజేతగా రామ్స్ జట్టు నిలిచి సీజన్ 3 విజేతగా నిలిచింది. ద్వితీయ బహుమతి రియాద్, తృతీయ ట్రోఫీ నీ గోపాల్ జట్టు సాధించింది. విజేతలకు స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు అందజేశారు. ఈ కార్యక్రమాలు ఫుట్ బాల్ నిర్వాహకులు గోపాల్ గౌడ్, బాల కృష్ణ, రామచందర్, శ్రీనివాస్ నాయక్, చైతన్య, డిన్ను ప్రశాంత్, వంశీ కృష్ణ, వినయ్, మున్నా, కరుణాకర్ తదితులు పాల్గొన్నారు.

# డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ మృతి



**చిన శంకరంపేట,అక్టోబర్19 (సిరి న్యూస్):** మండల పరిధి లోని కామారం గ్రామంలో వరి కోత పనులు జరుగుతుండగా శనివారం సాయంత్రం వడ్ల లోడుతో ఉన్న ట్రాక్టర్ను డ్రైవర్ స్వామి నిర్లక్ష్యంగా నడపడంతో ఇందూరి సాలమ్మ 50 సంవత్సరాలు మృతి చెందింది. వివరాల్లోకి వెళితే కామారం గ్రామానికి చెందిన సాలమ్మ అనే మహిళను ట్రాక్టర్ డీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో మరణించింది. తన భర్త ఇందూరి సిద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నారాయణ గౌడ్ తెలిపారు.

# అగ్నిమాపక కేంద్రాల సేవలు హర్షనీయం

- ఫైర్ డిపార్ట్మెంట్ అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ అక్టోబర్ 19(సిరిన్యూస్) :** జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల సేవలు హర్షనీయం,ఫైర్ డిపార్ట్మెంట్ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు అన్నారు.ఆదివారం రామాయంపేట మండలంలోని అగ్నిమాపక కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు.ఫైర్ స్టేషన్లో, కేంద్రంలో పలు రకాల పరికరాల పనితీరు, వాహనాల ఉపయోగం సిబ్బంది హాజరు పట్టికలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల సేవలు హర్షనీయం తెలిపారు.అగ్నిమాపక సిబ్బంది శిక్షణ, పరికరాలు, భవన భద్రతా నియమాలు వంటి అంశాలపై అధికారులకు సూచనలు అందించామన్నారు. ఆపద సమయాల్లో ప్రజలనుంచి వచ్చేటు వంటి ఫిర్యాదులకు వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగాలి

- విద్యుత్ సరఫరా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ రూరల్ అక్టోబర్ 19 (సిరి న్యూస్) :** మెదక్ మండలంలో పాతూరు సబ్ స్టేషన్ ను కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యుత్ శాఖ సిబ్బందిని కలిసి విద్యుత్ సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా కొనసాగించాలంటూ అధికారులకు సూచనలు చేశారు. ఈమధ్య కాలంలో మెదక్ పట్టణంలో వేల పాల లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు కరెంటు పోతుంజిదని అలా జరగకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దీపాల కాంతులవలె ప్రతి ఇంటా వెలుగులు నిండాలి

- మండలప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు
- తాజా మాజీ జెడ్పీటిసి పబ్బ మహేష్ గుప్తా



**శివంపేట్ అక్టోబర్ 19 (సిరి న్యూస్) :** చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి అని.. దీపాల కాంతులవలె తెలంగాణలోని ప్రతి ఇంటా వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ దీపావళి పండుగ సందర్భంగా శివంపేట మండలప్రజలందరికీ తాజా మాజీ జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూచెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామన్నారు. చీకటిని పారద్రోలే వెలుగుల పండుగతో తెలంగాణ లోనూ చీకట్లు తొలగి మళ్లీ అభివృద్ధితోవెల్లివిరియాలన్నారు. అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించాలన్నారు. అలాగే బాణసంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా చిన్నపిల్లలను బాణాసంచాకు దూరంగా ఉంచాలని సూచించారు.

# సీఎం రేవంత్ రెడ్డికి రైతులపై సోయి లేదు

- పత్తి, మొక్క జొన్న, వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- రైతు కూలీలతో మాజీ మంత్రి హరీష్ రావు మాటామంతి



**సిద్దిపేట, అక్టోబర్ 19 ( సిరిన్యూస్):** సీఎం రేవంత్ రెడ్డికి ప్రతి పక్షాలను తిట్టే బూతుల మీద ఉన్న సోయి పత్తి, మొక్క జొన్న, వరి పంటలు సాగు చేసిన రైతుల తిప్పలపై లేదని, ప్రభుత్వం యుద్ధప్రాదిప దికన కొనుగోలు కేంద్రాలు ప్రారంభిం చాలనీ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం లోని గంగాపూర్ గ్రామంలో మొక్క జొన్న కంకుల పొట్టు తీస్తున్న కూలీలు పగటి పూట భోజనం చేస్తుండగా హరీష్ రావు వాళ్ళ దగ్గరకు వెళ్లి కూర్చొని ముచ్చటిం చారు. రైతులు సాగు చేసిన పంటల వివరా లు, విక్రయాలకు వారు పడుతున్న ఇబ్బం దులను అడిగి తెలుసుకున్నారు. అనంత రం ఆయన మాట్లాడుతూ, అధిక వర్షాలు పడి ఇప్పటికే పత్తి రైతులకు దిగుబడి తగ్గి నష్టం జరిగిందని, ఉన్న పత్తిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనడం లేదన్నారు. దాంతో పత్తి రైతులు దళారులకు విక్రయిస్తూ రూ.8100 మద్దతు ధరను కోల్పోయారని చెప్పారు. ఈ ప్రభుత్వం పత్తి రైతులకు క్వింటాలుకి రూ.2వేల నష్టం కలిగిస్తుం దన్నారు. రాష్ట్రంలో 6లక్షల ఎకరాలలో మొక్క జొన్న సాగు చేశారని, మక్కలు మార్కెట్ లో పెట్టుకునో రైతులు పడిగాపులు కస్తున్నారనీ చెప్పారు. ఇప్పటికే 30%- 40% వరకు రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించారని వెల్లడించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో సకాలంలో మక్కలు కొన్నామని, వ్యవసా యానికి 24 గంటల కరెంట్ ఇచ్చామని, సకాలంలో రైతు బంధు ఖాతాలో జమ చేశామని తెలిపారు. రెండుసార్లు రైతు బందులు ఇచ్చి, రెండు రైతు బందులు ఏగొట్టిండు, సగం ఋణ మాఫీ చేసి, సగం రుణ మాఫీ ఎగొట్టిండు, కౌలు రైతులకు ఋణమాఫీ చేస్తా అని మాట తప్పిండు, రైతులకు 11 గంటల కరెంట్ మాత్రమే ఇస్తుండనీ మండిపడ్డారు. తొందరపడి రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకో వద్దని సూచించారు.

**బాధితులకు అండగా ఉంటా..**

సిద్దిపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను ఆదివారం హరీ ష్ రావు సందర్శించి పరామర్శించారు అధైర్య పడద్దని అండగా ఉంటానని భరో సా కల్పించారు. హుస్నాబాద్ మండలం లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మృతి చెందిన వివేక్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు.

## బాల్యమిత్రునికి ఆర్థిక సహాయం



**చేగుంట అక్టోబర్ 19 సిరి న్యూస్ :** చిన్ననాటి మిత్రుడు మరణించడం మాకు త్రివంగ కలసి వేసింది, చిన్నప్పట్నుండి మేమంతా కలిసి చదువుకున్నాం, ఇప్పుడు లేదని విషయం మాకు చాలా బాధాకరం అని అన్నారు, చేగుంట మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి ప్రవీణ్, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలుసుకొని వారి కుటుంబానికి పరిమాశించి, వారికీ తోచిన విధంగా అర్థక సహాయం అందించారు, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవీణ్, అందరితో కలిసి, మెలిసి ఉంటూ, ఆటపాటల్లో చురుకుగా పాల్గొనే వాడు, మా స్నేహితుని మరణం మాకెంతో బాధాకరం అని, మేము ఎప్పుడు వారి కుటుంబనికి ఎల్లవేళలా, మాకు తోచిన సహాయం అందిస్తామని అన్నారు,ఈ కార్యక్రమంలో, ఎం శ్రీకాంత్, జి యాదగిరి,వై సిద్దిరాములు, కే నర్సింలు, వై మహేష్, కొండి మమత, నవనీత, వై మమత, వై లావణ్య, పాల్గొన్నారు.

## చీకటిని పారద్రోలే, వెలుగుల నింపే పండుగ దీపావళి



**చేగుంట అక్టోబర్ 19(సిరిన్యూస్) :** చేగుంట పట్టణ ప్రజలకు, ప్రముఖ సంఘసే వకులు, జిల్లా వాలీబాల్ అసోసి యేషన్ అధ్యక్షులు అయిత పరంజ్యోతి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్బంగా తాను మాట్లాడుతూ, దీపావళి అనగా చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారదోలే, వెలుగులను నింపే పండుగ దీపావళి అని, చేగుంట మండల, పట్టణ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఈ పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని,పిల్లలు టపాకాయలు కాల్చే సమయంలో, తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లిదండ్రులకు సూచించారు.పట్టణ ప్రజల పైన లక్ష్మీదేవి అనుగ్రహం, ఉండాలని, అందరికీ శుభం చేకూరాలని, సుఖసంతో షాలతో ఉండాలని అన్నారు.

## సెల్ఫీ కోసం వెళ్లి గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కొల్చారం అక్టోబర్ 20 ( సిరి న్యూస్)** కొల్చారం మండల పరిధిలోని పోతం శెట్టిపల్లి శివారులో రెండవ బ్రిడ్జి వద్ద మంజీరా నది సమీపంలో సెల్ఫీ కోసం వెళ్ళిన ఓ వ్యక్తి మంజీరా లో గల్లంతయి మృతిచెందిన వివరాలు ఇలా ఉన్నాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి సెల్ఫీ ఫోటో కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నదిలో జారి పడడంతో ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు మృతి వివరాలు తెలియకపోవడంతో దర్యాప్తు జరుపుతున్నామని అన్నారు.

## మెదక్ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ అక్టోబర్ 19(సిరిన్యూస్) :** ప్రజల జీవితాల్లో దీపావళి పండగ కోటికాంతులు నింపాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకాంక్షించారు. చీకటి నుంచి వెలుగులోకి... చెడుపైన మంచి... దుష్టశక్తు లపైన దైవశక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ పండగను ఆనందోత్సాహాలతో కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవాలని కోరారు. పండగ సందర్భంగా బాణాసంచా కాల్చే సమయంలో అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండగను ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఆనందంగా జరుపు కోవాలన్నారు. జిల్లా ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు కలిగి ప్రతి ఇంటా కోటి ఆనంద దీపాలు వెలగాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకాంక్షించారు.

## వెలుగులు నిండుగా దీపావళి పండుగ

- జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి



**మెదక్ అక్టోబర్ 19(సిరిన్యూస్) :** దీపావళి పండుగ మెదక్ జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు ఆనందం, ఐశ్వర్యం నింపాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి తెలిపారు.ఈ దీపావళి ప్రతి ఇంటిలో ఆనందాల ప్రమీదలు వెలిగించాలన్నారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా,చీకటిని పారదోలే వెలుగుల పండుగ దీపావళి, ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.ఈ పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, పిల్లలు పటాకులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. లక్ష్మీదేవి అనుగ్రహంతో అందరికీ శుభం చేకూరాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు.

## దీపావళి శుభాకాంక్షలు

- టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్



**మెదక్ రూరల్ అక్టోబర్ 19, (సిరి న్యూస్) :** జిల్లాలోని అన్ని వర్గాల ఉద్యోగులకు, అధికా రులకు, విశ్రాంత ఉద్యోగులకు ప్రజలందరికీ టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ దీపావళి పండగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా లక్ష్మీదేవి కరుణ కటాక్షాలతో అందరి జీవితాలలో వెలుగు ప్రసా దించాలని ప్రార్థించారు, కుటుంబ సభ్యులతో ఆనందంగా పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా చిన్నారులు టపాకాయలు కాల్చే క్రమంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్త పాటించాలని కోరారు.

## స్కూటీ, టీవీఎస్ ఎక్సెల్ ఢీకొని వ్యక్తి మృతి

**చిన్నశంకరంపేట,అక్టోబర్19,(సిరి న్యూస్) :** గవ్వలపల్లి చౌరస్తా సమీపంలో శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో స్కూటీ మరియు టీవీఎస్ ఎక్సెల్ ఢీకొనగా స్కూటీ పైన వెనకాల కూర్చున్న మేకల బెన్ని కుమార్ వయస్సు 58 సంవత్సరాలు నివాసం వడియారం అను అతనికి తలకు బలమైన గాయం కావడం వలన మేడ్చల్ సంప్రద ఆస్తుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. తన తమ్ముడి కొడుకు దాసరి రిచర్డ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నారాయణ గౌడ్ తెలిపారు.

# కోటి శ్రీ రుద్ర శ్రీ సూక్త పారాయణం



- శ్రీ శ్రీ శ్రీ మాధవ నంద సరస్వతి స్వామి
- శివునికి ఆవుపాలతో అభిషేకం
- దంపతులచేత లక్ష పుష్పార్చన
- అన్నప్రసాద వితరణ
- పూజలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**గుమ్మడిదల, అక్టోబర్ 19 (సిరి న్యూస్):** కోటి శ్రీ రుద్ర శ్రీ సూక్త పారాయణ అంతరత శ్రీ రుద్ర శ్రీ సూక్త పారాయణ, 1116 ఆవుపాలతో శివునికి అభిషేకం మరియు లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని రంగంపేట పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ మాధవ నంద సరస్వతి స్వామి వారి ఆదేశానుసారము ఆదివారం రోజున గుమ్మడిదల శ్రీ కృష్ణానంద స్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో మహా రుద్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ కేంద్రమైన గుమ్మడిదలలో ఆదివారం కోటి విరుద్ధ పారాయణంలో భాగంగా భవాని శంకర (శివాలయంలో) ఆవుపాలతో అభిషేకాన్ని, దంపతుల చేత లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రజలే కాకుండా ఇతర జిల్లాల నుండి భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.ఈ పూజా కార్యక్రమంలో శ్రీ మధుసూదనానంద సరస్వతి స్వామి తో పాటు ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి, రవీందర్ రావు కులకర్ణి, కాళ్ళ కంటి రవీందర్ రెడ్డి, పురోహితులు శంకర్ శర్మ, కిరణ్ కుమార్ శర్మ, రామ్ పంతులు, కానుకుంట రామ్ పంతులు, ప్రసాద్ పంతులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చు గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు ప్రవీణ భాస్కర్ రెడ్డి, లక్ష్మణ్, అమ్మగారి రవీందర్ రెడ్డి, పోచుగారి రవీందర్ రెడ్డి, ఆకుల ఆంజనేయులు, సత్యనారాయణ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**శివునికి ఆవుపాలతో అభిషేకం**

శ్రీ భవాని శంకర ఆలయంలో 1116 లీటర్ల ఆవు పాలతో భక్తుల చేత శివునికి అభిషేకాన్ని నిర్వహించారు ప్రతి ఒక్కరూ తప్పకుండా ధోతి ధరించి సంప్రదాయ దుస్తులలో పాల్గొని స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అభిషేకం చేసిన ఆవుపాలను ప్రసాదంగా భక్తులకు అందజేశారు

**దంపతుల చేత లక్ష పుష్పార్చన**

మహా రుద్రం కార్యక్రమంలో భాగంగా దంపతుల చేత లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణముల మధ్య నిర్వహించారు. అనంతరం పుష్పార్చన నిర్వహించిన పూలను శివునికి అభిషేకాన్ని నిర్వహించారు.

**అన్నప్రసాద కార్యక్రమం**

మహా రుద్రం కార్యక్రమంలో భాగంగా వచ్చిన భక్తులకు మహా ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల సహకారంతో ఈ మహా రుద్ర కార్యక్రమాన్ని శ్రీ కృష్ణానంద సరస్వతి ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులంతా స్వచ్ఛందంగా పాల్గొన్నారు.



**పూజలో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

గుమ్మడిదలలో జరిగిన కార్యక్రమం మహా రుద్రం కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారి అనుగ్రహంతో ఆధ్యాత్మికత నడిపిస్తున్నారు. పురాతన ఆలయాలను పునర్నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. స్వామీజీ చూపే మంచి మార్గంలో అందరూ ప్రయాణించాలని కోరారు.



